క్లుప్తంగా

సీఐని కలిసిన శివకుమార్



సీఐ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న మద్దెల శివకుమార్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ రాయల వెంకటేశ్వర్లును అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

ఆరోపణలు సరికాదు

సింగరేణి(కొత్తగూడెం): అస్తిత్వం కోసం తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని ఇఫ్టూ నాయకులు డి.ప్రసాద్, సంజీవ్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఇఫ్టూ నాయకులపై కొందరు తప్పుడు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ప్రజాపంథా, అనుబంధ సంఘాల నుంచి ఎందుకు వైదొలిగామో చెప్పామే తప్ప, తామేమీ తప్పుడు ప్రకటనలు చేయలేదని తెలిపారు. సమావేశంలో గౌని నాగేశ్వరరావు, మోతుకూరి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



జెడ్పీ కార్యాలయంలో భగీరథ మహర్షికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

చుంచుపల్లి: భగీరథ మహర్షి జయంతిని గురువారం జెడ్పీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన భగీరథ మహర్షి జయంతి ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీఓ రమేష్, కార్యాలయ సిబ్బంది పాష పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

పాల్వంచ: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు గురువారం పాల్వంచ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను వైద్య బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పలు రకాల రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఆస్పత్రుల నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లోని స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించారు.

తునికాకు సేకరణ ఎప్పుడో?



ఉల్వనూరు అటవీ ప్రాంతంలో ఏపుగా పెరిగిన తునికాకు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణ సమయం సమీపిస్తున్నా తునికాకు సేకరణ జరపడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వేసవిలో రెండునెలల పాటు గిరిజన, గిరిజనేతర కూలీలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు లభించే తునికాకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారం నుంచి సేకరణ ప్రారంభిస్తారు. ఈసారి అకాల వర్షాల కారణంగా పాల్వంచ అభయారణ్యంలో తునికాకు చెట్లు ఏపుగా పెరిగి ఆకులు ముదురిపోతున్నాయి. ఆకులు ముదిరితే పనికి రాకుండాపోతాయని వెంటనే తునికాకు సేకరణ ప్రక్రియ ప్రారంభించాలని కూలీలు కోరుతున్నారు.

విద్యాసంస్థలకు స్థలాలు కరువు

మూడు గురుకులాలు మంజూరై ఏడేళ్లు

- అద్దెభవనాలు, ఇతర పట్టణాల్లోనే తరగతులు
- ఏళ్ల తరబడి స్థలాల కోసం అన్వేషణ
- సింగరేణి లీజు భూములు గురుకులాలకు పనికిరావా..?



సింగరేణి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మైనారిటీ గురుకులం

ఇల్లెందురూరల్: పట్టణమైనా.. పల్లె అయినా.. స్థానికంగా మెరుగైన విద్యాసంస్థలు ఉంటేనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి. కానీ బొగ్గు గనులకు జన్మనివ్వడంతోపాటు వందల సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఇల్లెందులో మచ్చుకైనా ఒక్క విద్యాసంస్థ కనిపించదు. వచ్చిన పలు అవకాశాలను వినియోగించుకోలేక పోవడం ఈ ప్రాంత ప్రజలకు శాపంగా పరిణమించింది. ఇందులో రాజకీయ పక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు.. అందరి పాత్రా ఉంది.

విశ్రాంతి భవనాలకు నామకరణంతో..

బొగ్గు గనులకు పుట్టినిల్లైన ఇల్లెందుకు వందకు పైగా ఏళ్ల చరిత్ర ఉంది. నాటి నుంచి ఈ ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం బొగ్గు తవ్వకాలు చేపట్టింది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించిన సింగరేణి సంస్థ ముద్దుగా ఇల్లెందు పేరును విస్తరించిన ప్రాంతాలలో విశ్రాంతి భవనాలకు పెట్టుకుంది. సంస్థ ఆర్జించిన లాభాల్లో నుంచి పలుచోట్ల ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి సాంకేతిక విద్యాసంస్థలతోపాటు ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు సాధారణ విద్యాసంస్థలను నెలకొల్పింది.

పుట్టినిల్లైన ఇల్లెందులో మాత్రం కేవలం పదో తరగతి వరకు మాత్రమే విద్యాసంస్థలను పరిమితం చేసింది. ఈ విషయంలో బుధవారం జరిగిన జేకే ఓసీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మినహా గతంలో ఎవరూ ఇల్లెందులో మంచి విద్యాసంస్థను నెలకొల్పాలని సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారు.

దారిమళ్లిన విద్యాసంస్థలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత ప్రభుత్వం ప్రతి మండలానికి గురుకులాలను మంజూరు చేసింది. ఈ క్రమంలోనే ఇల్లెందులో మైనారిటీ, ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయి. ముందుగా మంజూరైన మైనారిటీ గురుకుల పాఠశాల కోసం మూతపడిన సింగరేణి ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేసి తరగతులు ప్రారంభించారు. ఆ తరువాత మంజూరైన ఎస్సీ, బీసీ గురుకులాలకు వసతులు చూపకపోవడంతో ఇల్లెందు నుంచి ఇతర ప్రాంతాలకు మార్చబడ్డాయి. ప్రస్తుతం ఎస్సీ గురుకులం కారేపల్లి మండలంలో, బీసీ గురుకులం ఖమ్మం పట్టణంలో కొనసాగుతున్నాయి. అంతేకాకుండా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల మంజూరైంది. శంకుస్థాపనకు కూడా ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంబరపడ్డారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. ఏం జరిగిందో ఏమో కానీ అది ఇల్లెందు నుంచి అశ్వరావుపేట నియోజకవర్గానికి తరలిపోయింది.

ప్రతిపాదనలకూ నోచుకోని వైనం

ఇల్లెందుకు మంజూరైన గురుకులాలకు అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలని 2017 నుంచి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తూ వస్తోంది. కానీ ఆ దిశగా ఖాళీ స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు అధికారులు ముందుకు రాకపోవడం విచారకరం. కానీ ఎక్కడ స్థలం కనిపించినా కబ్జాకు గురికావడం, ఉన్నతాధికారులను మెప్పించి అటువైపు చూడకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి పరిణామాలు ఇల్లెందులో సాధారణంగా మారిపోయాయి. దీంతో గురుకులాలకు స్థలం కేటాయింపు నేటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. 2018లో ఎస్సీ గురుకులానికి స్థలం కేటాయించిన రెవెన్యూ అధికారులు నేటికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

సింగరేణి అప్పగించిన భూములు పనికిరావా..

సింగరేణి సంస్థ బొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు పట్టణ, మండలంలో వేల ఎకరాల విస్తీర్ణంలో భూములను ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకుంది. ప్రస్తుతం ఇల్లెందు, పరిసర ప్రాంతాలలో భూములతో సంస్థకు అవసరం తగ్గిపోవడంతో పలుదఫాలుగా లీజు భూములను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తూ వస్తోంది. ఇలాంటి భూములను రెవెన్యూ అధికారులు పట్టణ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థల మనుగడ కోసం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. కానీ జనాభా అవసరాలకు మంచి సదుపాయాలు కల్పించే విధంగా లీజు భూములను కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఉదాహరణకు పట్టణంలో వందేళ్ల చరిత్ర కలిగిన మార్కెట్‌ను రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్నారు. అదేవిధంగా జేకే కాలనీలో మరోమార్కెట్‌ను నిర్మిస్తున్నారు. ఇదే తరహాలో ఉన్న నిర్మాణాల బాటలోనే నూతన నిర్మాణాలకు స్థలాలు కేటాయిస్తున్న అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది.

గురుకులాలకు స్థలం కేటాయించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇల్లెందు పేరుతో మంజూరు చేసిన గురుకులాల్లో మైనారిటీ గురుకులం మినహా ఏ ఒక్కటీ ఇల్లెందులో లేదు. సౌకర్యాలు కల్పించడంలో అధికారుల వైఫల్యం కారణంగా ఇతర ప్రాంతాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే గురుకులాలు ఉంటే విద్యాప్రమాణాలు మెరుగుపడటంతోపాటు వ్యాపారపరంగా ఇల్లెందుకు మేలు కలుగుతుంది.

– అభిమన్యు, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా సహాయ కార్యదర్శి

విద్యాసంస్థలను నెలకొల్పాలి



సింగరేణి సంస్థ అప్పగించిన లీజు భూములను సాంకేతిక విద్యాసంస్థలు నెలకొల్పేందుకు కేటాయించాలి. దశాబ్దాలుగా ఇల్లెందుకు ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని ఉద్యమించినా స్థలాభావంతో మంజూరుకు నోచుకోలేదు. ప్రస్తుతం భూములు ఉన్నందున గురుకులాలకు స్థలం కేటాయించడంతోపాటు మంజూరుకు ముందే ఐటీఐ కళాశాలకు స్థలాన్ని ప్రకటించాలి.

– సాంబ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు అండగా ఉంటా..



బంజర గ్రామంలో వధూవరులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పాల్వంచరూరల్: పదవులు ఉన్నా లేకున్నా తాను నిరంతరం ప్రజల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటానని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏజెన్సీ ప్రాంతం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజర, మల్లారం, నర్సింహాసాగర్, ఉల్వనూరు, చింతగుంపు, కొత్తూరు, మందేరకలపాడు, సారెకల్లు, కారెగట్టు, ప్రభాత్‌నగర్ గ్రామాల్లో పొంగులేటి పర్యటించారు. నూతనంగా వివాహం చేసుకున్న దంపతులను ఆశీర్వదించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలను పరామర్శించారు. పొంగులేటి మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేద ప్రజలను ఎల్లప్పుడూ ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానికిరెడ్డి, గోపాల్‌రావు, తుమ్మల శివారెడ్డి, చింతానాగరాజు, అప్పారావు, ఆవుల మధు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో విద్య



మాట్లాడుతున్న ఉమాదేవి

కొత్తగూడెంటౌన్: రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు ప్రీస్కూల్‌కు పంపించాలని సూపర్‌వైజర్ ఉమాదేవి కోరారు. గురువారం పాత కొత్తగూడెంలోని అంగన్‌వాడీ–2 సెంటర్‌లో జరిగిన అంగన్‌వాడీలోని పిల్లలు, తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలో టీచర్లు పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రతి బిడ్డకు సంవత్సరంలో మూడుసార్లు అంటే జూలై చివరి వారం, డిసెంబర్, ఏప్రిల్ మొదటి వారంలో లేదా రెండవ వారంలో పిల్లల ఎదుగుదలను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.వెంకటరమణ, శ్రీదేవి, రజిత, వెంకటలక్ష్మి, నందిని, సరిత, భాగ్యలక్ష్మి, పద్మ, స్కూల్ ఉపాధ్యాయులు ఖాజామొహియుద్దీన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మే డే స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న యాకుబ్‌షావలి

ఇల్లెందు: కార్మికులు పని గంటల కుదింపు కోసం పోరాడి సాధించుకున్న మే డేను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని ప్రజాపంథా అనుబంధ ఇఫ్టూ రాష్ట్ర నాయకులు యాకుబ్ షావలి కోరారు. గురువారం ఇల్లెందులో మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అనేక పరిశ్రమలలో కార్మికుల ఎన్నో పోరాటాలు చేస్తున్నారని, వారికి కనీస హక్కులు లేకుండా పోతున్నాయని తెలిపారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని వాపోయారు. పాయం వెంకన్న, దుర్గారావు, కుమార్, వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు.

కాలనీ పేరు మార్పుతో వెలిసిన బోర్డు



బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ఇల్లందు: పట్టణంలోని 1వ, 3వ వార్డుల ప్రాంతం ఎన్జీఓ కాలనీకి డీవీ సార్ కాలనీగా నామకరణం చేస్తూ గురువారం ఓ బోర్డు వెలిసింది. అయితే అదే ప్రాంతానికి చెందిన అసమ్మతి నేత, 3వ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ ఆయిన కొక్కు నాగేశ్వరరావు ఈ బోర్డు ఏర్పాటు చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై చైర్మన్ డీవీని వివరణ కోరగా తనకు సమాచారం లేకుండా స్థానికులు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

పాల్వంచ: రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫమయిందని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల అనంతరాములు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రైతులు పండించిన పంటలు ఇంకా కల్లాల్లోనే ఉన్నాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా కొనుగోళ్లు చేపట్టలేదన్నారు. సొసైటీ చైర్మన్లు పార్టీ కార్యకలాపాలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతు సేవలను విస్మరిస్తున్నారని వాపోయారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలి సందర్శించారు. గురువారం ట్యాంక్ బండ్, లేక్ వ్యూ పార్క్, చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేయనున్న ఈత కొలను స్థలాన్ని పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని, త్వరలో మంత్రి కేటీఆర్ ఇల్లెందు రానున్నందున అన్ని పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నరేష్‌రెడ్డి, ఏఈ శంకర్, బీఆర్ఎస్ నేతలు లాలు, ఈశ్వర్, రవి, మెరుగు కార్తీక్ యాదవ్, సతీష్, రామకృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

నేడు న్యాయ సహాయ కేంద్రం

ఇల్లెందురూరల్: సుదిమళ్ల రైతువేదికలో శుక్రవారం వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని ఇల్లెందు మెజిస్ట్రేట్ ముఖేష్ ప్రారంభిస్తారని ఏఓ సతీష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు ప్రారంభమయ్యే కేంద్రంలో రైతులకు కోర్టుకు సంబంధించిన న్యాయ సలహాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు ‘చలో కలెక్టరేట్’ను విజయవంతం చేయండి




మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇఫ్టూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు తోడేటి నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, సూర్నపాక నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని పోలారం గ్రామంలో గురువారం ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లి వారితో సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.750 చెల్లించాలని, కనీస సౌకర్యాలు, ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, స్లిప్పులు ఇవ్వాలని, ఈ పథకంలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో 28న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌కు కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి కార్యదర్శుల నిరవధిక సమ్మె

టేకులపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ దశలవారీ ఆందోళనలు చేపడుతున్న టేకులపల్లి మండలంలోని 30 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు. ఇప్పటికే ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంపీపీ, ఎస్ఐ, తహసీల్దార్లకు సమ్మె నోటీసులు, సామూహికంగా సీఎంకు పోస్టు కార్డులు పంపించారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్న అధికారిక వాట్సాప్, టెలిగ్రామ్ 15 గ్రూపుల నుంచి లెఫ్ట్ అయిన విషయం తెలిసిందే. దశల వారీ ఆందోళనల్లో భాగంగా శుక్రవారం నుంచి సమ్మె చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటిస్తూ కార్యదర్శులు గురువారం డీపీఓ, డీఆర్‌ఓలకు సమ్మె నోటీసులు అందజేశారు. టేకులపల్లి మండలంలో మొత్తం 36 మందికి గాను 30 మంది జేపీఎస్‌లు ఉండగా ఆరుగురు మాత్రమే రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. సమ్మె ప్రారంభమైతే గ్రామాల్లో పారిశుద్ధ్యం, నర్సరీలు, పార్కులు, డంపింగ్ షెడ్లు, శ్మశాన వాటికలు తదితర నిర్వహణ పనులు నిలిచిపోనున్నాయి.

సహకార సంఘం ఉద్యోగుల హర్షం



డీసీఓ నుంచి ఆర్డర్ కాపీలు అందుకుంటున్న సహకారం సంఘ ఉద్యోగులు

టేకులపల్లి: జీఓ నంబర్ 44 ప్రకారం సహకార సంఘం సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీ, మానవ వనరుల సమీకృత విధానాలను సహకార సంఘాలకు వర్తింపజేస్తూ ఇచ్చిన వేతన సవరణతో వేతనాలు పెరగడంతో ఆ సంఘం ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉద్యోగులు జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ (డీసీఓ) ఎస్.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆర్డర్ కాపీలు స్వీకరించారు. జీఓ 44 అమలుతో రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండో జిల్లాగా గుర్తింపు పొందింది. జీఓ అమలుకు కృషి చేసి ఉద్యోగులకు ఆర్డర్లు అందజేసిన డీసీఓ ఎస్.వెంకటేశ్వర్లుని బేతంపూడి సొసైటీ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాన్నోజు ప్రేమాచారి, యూనియన్ నేత కందుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలియజేశారు. జీఓ అమలుకు సహకరించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి బి.శంకర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు లంకా నరసింహారావు, గౌరవాధ్యక్షుడు ఎస్‌కె.జిలానీ, జిల్లా కార్యదర్శి సున్నం వెంకటేశ్వర్లు, కోశాధికారి రమణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బయటపడిన ‘ఉపాధి’ అక్రమాలు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జలగూడెం, మైలారం, హరిజతండా, శేషగిరినగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగాయని సామాజిక బృందం గురువారం తేల్చి చెప్పింది. కొన్నిచోట్ల పనులు చేయకుండానే చేసినట్లు నమోదు చేసి డబ్బులు డ్రా చేసినట్లు బయట పడింది. మండలంలో 2020 నుంచి ఇప్పటి వరకు 31 పంచాయతీల్లో రూ.13.94 కోట్ల ఉపాధి హామి పనులు నిర్వహించారు. కూలీలకు రూ.11.12 కోట్లు, మెటీరియల్‌కు రూ.2.82 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఉపాధి హామి పనులపై సీఆర్‌పీ, ఎస్‌ఆర్‌పీలు పది రోజులుగా పని ప్రదేశాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు ఓపెన్ ఫోరం నిర్వహించారు.

రూ.14 కోట్ల పనులలో రూ.4.61లక్షల అక్రమాలు..

లక్ష్మీదేవిపల్లి మండలంలో రూ.14 కోట్ల ఉపాధి హామీ పనులు జరగగా రూ.4,61,854 అక్రమాలు జరిగిన్నట్లు సామాజిక బృందం తేల్చి చెప్పింది. ఇందులో బొజ్జలగూడెం రూ.86,514, హర్యతండాలో రూ.40,290, మైలారం రూ.66,201, సీతారాంపురం రూ.74,868, శేషగిరినగర్‌లో రూ.31వేలు, లోతువాగు రూ.14,225, కొత్తచింతకుంట రూ.14,834, కారుకొండ రూ.10,402, గడ్డిగుట్ట రూ.18,930, ఎదురుగడ్డ రూ.13,675, బావోజీతండా రూ.12,792, అనిశెట్టిపల్లి రూ.5,131, అశోక్‌నగర్ 2,229, బంగారుచెలక 2,150, దూద్యతండా 4,077, చాతకొండ 7,608, గట్టుమళ్ల 824, హమాలీకాలనీ 1,365, హేమచంద్రపురం 5,089, లాలుతండా 8,475, లక్ష్మీదేవిపల్లి 4,121, లక్ష్మీపురం 6,916, ప్రశాంతినగర్ 6,257, పునుకుడుచెలక 1,265, రేగళ్ల 2,069, రేగళ్లపాడు తండా రూ.4,631, సంజయ్‌నగర్ రూ.200, సాటివారిగూడెం 4,284, శ్రీనగర్‌కాలనీ రూ.1,759, తెలగరామవరం రూ.9,233, వేపలగడ్డ రూ.1,220 అక్రమాలు జరిగిన్నట్లు సోషల్ ఆడిట్ బృందం స్పష్టం చేసింది. ఉపాధి హామీ సిబ్బంది రికార్డులు సక్రమగా నిర్వహణ చేయని కారణంగా రూ.88,500 జరిమానా విధించారు. దీనిని ఉపాధి హామి సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న వీఓఏలు



టేకులపల్లిలో...



పాల్వంచరూరల్‌లో...

జూలూరుపాడు: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం జూలూరుపాడులో వీఓఏలు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు కడియాల ఉమ మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు దుర్గారావు, శ్రీనివాస్, రామకృష్ణ, బాలకోటేశ్వరి, బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ విధులను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సెర్ప్ కార్యాలయం ఎదుట ఒంటికాలుపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏలను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. పొదుపు సంఘాల ఆవిర్భావం నుంచి విధులు నిర్వహిస్తూ సెర్ప్ మనుగడకు కృషి చేసిన వీఓఏల విధులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో నవ్య, ప్రమీల, పాపారావు, వసంతరావు, సుల్తానా, పృథ్వీ, సుమతి, నాగలక్ష్మి, సుజాత, వసంత తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారం వీఓఏలు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. సమ్మెకు జిల్లా కాంగ్రెస్ నేత లక్కినేని సురేందర్ రావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి జిలకర పద్మ, జిల్లా నేత అబ్దుల్ నబీ, కొండపల్లి శకుంతల, పి.రాజేశ్వరి మద్దతు పలికి సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ, మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ ఐకేపీ వీఓఏలు చేపట్టిన రిలేనిరాహార దీక్షలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.సత్య మాట్లాడారు. వీఓఏల సమ్మె ఉధృతం కాకముందే ముఖ్యమంత్రి చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో వి.అనురాధ, ఎస్.రమేష్, రమాదేవి, ఉమాకుమారి, కృష్ణవేణి, సుజాత, కల్పన, పద్మ, మౌనిక, రోజాకుమారి, జయ, సుమలత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు..





టేకులపల్లి పంచాయతీ సమ్మక్క, సారక్క గద్దెల వద్ద ప్రధాన రహదారి వెంబడి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు పంచాయతీ శాంతినగర్‌లో ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రెండూ ఒకవైపుకు ఒరిగి ఏ క్షణంలోనైనా కిందపడే ప్రమాదం పొంచి ఉంది. అసలే వేసవికాలం ఈదురు గాలులకు జరగరానిది ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరని, విద్యుత్ శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : హెచ్.దేవా, విద్యుత్ శాఖ ఏఈ, టేకులపల్లి
సెల్‌నెంబర్: 9440811562